కథానిక

మరో ప్రపంచం

టి. జగన్మోహనరావు

అనూరాధపురంలో వున్న ఒక్క దేవుని గుడీ బాగా శిథిలమైపోయింది. దాని స్థితిని వర్ణిస్తే దేవుళ్ళంటే జాలి వేస్తుంది. ఆ గుడిలో రోజూ పూజ అంటూ యేమి జరుగదు. కాని ప్రతిరాత్రి గుడి మండపం దగ్గిర అధమం పాతికమందైనా గ్రామస్థులు పోగవుతారు. అధ్యక్షుడులేని సభ ఒకటి తయారవుతుంది. అసలు ఎక్కువసేపు మాట్లాడేవారు నలుగురైదుగురు మాత్రం వుంటారు. తక్కిన వాళ్లందరూ రేడియో వింటున్నట్టు వుండిపోతారు. అప్పుడప్పుడు తమకు తెలిసిన కొత్త సంగతుల్ని ఆ నలుగురైదుగురు ప్రధాన పురుషులకు వన్నెలు చిన్నెలు పెట్టి చెప్పుతుంటారు. ఆ కొత్త విషయాన్ని చర్చించే వాళ్లు ఆ నలుగురే. వారి ప్రాముఖ్యానికి కారణం యిదని చెప్పడానికేం లేదు. ఆవూరిలో వార్తాపత్రికలు తెప్పించి చదివేవాళ్లు వారే. పైగా తరచుపట్టణానికి వెళ్లేవారే. పైగా తరచు పట్టణానికి వెళ్తుండటంచేత ప్రపంచం అంటే సరిగ్గా తెలియని అనూరాధపురం ప్రజలకు నాయకులైపోయారు.

ఆ మంటపంమీద వారు చేయని ప్రసంగాలుండవు. మొదట్లో ప్రపంచ పరిస్థితులనుగురించి, అవి తమ కెంతో దగ్గరగావున్నట్టు భావిస్తూ, వాదనలు చేస్తారు. క్రమంగా దేశంలోని రాజకీయాలు, వస్తువుల ధరలు, కార్మికుల తగవులు మున్నగు విషయాల్లోకి దిగి చివరకు అనురాధపురం పంచాయతిబోర్డు వ్యవహారాల్నీ శ్రీరామనవమి వుత్సవాల్ని వారి సంభాషణల్లోకి తీసికొని వస్తారు. ఈ భాగమే అంతటిలోనూ రసవత్తరమైన ఘట్టం. అక్కడ చేరే వాళ్లలో చాలా మందికి కొన్ని కొన్ని అభిప్రాయాలు జీర్ణమైపోయి వుండేవి. వాటికి వ్యతిరేకంగా మాట్లాడే వారంటే అనుమానం, అపనమ్మకం వారికెప్పటికీ పోదు.

ఒక నాటిరాత్రి వెన్నెల బాగావుందేమో, మామూలుకంటె ఎక్కువ కాలం మంటపం సభ్యులు ముచ్చటించుకొంటున్నారు. వారి మాటల్లో ఆవేశం ఆదుర్దా కనిపిస్తున్నాయి. ఓ నల్భై సంవత్సరాల మనిషి తన మానగౌరవాలకి ఆపదవచ్చినట్లు చెప్పుతున్నాడు.

'...నాలుగు రోజులైందిట వచ్చి. రాధారి బంగళాలో మకాం పెట్టాడు. రోజూ నేను అటు వెళ్తూంటే వరండాలో పడక కుర్చీలో కూర్చుని చదువుతుంటాడు. అతనివైఖరంతా విచిత్రంగా కన్పించింది.'

'ఇంతకీ నీవాయన్తో ఎప్పుడైనా మాట్లాడావా?' అన్నాడొక సభ్యుడు అడ్డొస్తూ.

'ఎందుకాతొందర చెప్తుతూంటేను,' అని సమాధానంచెప్పి, ఒకసారి గొంతుక సవరించుకొని తిరిగి మొదలు పెట్టాడు.

'మన బంగాళా జమాను హడావుడిగా తిరుగుతూంటే, 'ఏం రా, దొరగారేమైనా వచ్చారా' అన్నా. వాడు 'కాదు బాబయ్యా, ఎవరో పట్టణాన్నించిటండి వచ్చారు. ఓ నెలరోజులుంటారండి మనూళ్లో. మా సరదా మనిషండి. మాంచి పనులేంటో చేయాలని వచ్చారట. అదుగో బయటికి వస్తున్నారండి' అని ప్రక్కకు తప్పుకున్నాడు. ఆయన దగ్గరగా వచ్చి నన్ను పరీక్షచేసినట్లు చూసి 'తమ రేం చేస్తుంటారు యీ వూళ్లో' అన్నాడు. ఏదో భూమి దున్నుకొని బ్రతుకు తున్నానని చెప్పా. ఇంతలో జమానుగాడుండి 'బాబూ, మా అయ్యగోరికి మూడొందల ఎకరాలున్నైయ్యండి' అన్నాడు. 'అంత మొహమాటంగా మాట్లాడుతారేం' అని ఆ వ్యక్తి బంగాళాలోకి తీసుకెళ్ళాడు.'

'చాలసేపు అనేక ఖబుర్లు అందంగాచెప్పాడు. ఏవో బిస్కట్లు యింత టీ యిచ్చి. 'అయ్యా, మీరీ వూరెందుకు వచ్చారు, చుట్టాలెవరైనా

వున్నారా?' అన్నా. దాంతో మొదలెట్టాడు సోద. ఏదో సొసైటీకి చెందిన మనిషిట. పల్లెటూళ్ళంటె యిష్టంట. అవి బాగుపడితేగాని దేశం బాగుపడదట: అందుకోసం పల్లెటూళ్ళను ఆదర్శంగా, జీవించుటకు తగిన విధంగా, తయారు చేయటమే తన జీవిత పరమావధిగ చివరకి తేల్చాడు.'

సభలో కొందరు గుసగుసలు మొదలెట్టారు. కొందరు నవ్వుకున్నారు.

'గాంధీగారి అవతారమా ఏమిటీయన' అన్నాడొకడు.

'లేదుట. ఆయన కసలు రాజకీయాలంటానే గిట్టవుట. కాంగ్రెసులో మెంబరే కాదుట. పైగా అంటాడూ, మానవసేవ చేయాలని సంకల్పించు కొన్న వాళ్లకు ఓ పార్టీ అనీ కక్షలని వుండవుట.'

'మరి వీడేంచేయగలట్ట?' అన్నాడొక సభ్యుడెగతాళిగా.

'అయితే యిక్కడేంచేద్దామని వచ్చాడేమిటి?'

'ఆ బంగాళాలోనే కూర్చొని టీలు త్రాగుతూ సిగరెట్లు వూదు తూంటాడు. అని ఒకరి జవాబు.

'రేపు ఆఫీసరు క్యాంపు కొచ్చాడంటే బంగాళా ఖాళీ చేయాలి వీడు' అన్నాడు మరొక సభ్యుడు.

ఎందుచేతనో ఆ నూతన వ్యక్తి అంటె, అక్కడి నాయక వర్గం వారికి అనుమానం, అయిష్టత, అసూయ కలిగాయి–చూడకుండానే.

'ఆయనగారి ప్రోగ్రామంతా చెప్పాడు.'

'ఏమిటేమిటి?'

'ఏమీలేదు. మన వూరంతా చూస్తాట్ట. బాగుచేయటానికి మార్గాలు సూచిస్తాట. నాలుగు ఉపన్యాసాలు పెట్టి, మనల్ని 'ఎడ్యుకేటు' చేయటం ముఖ్యమైన పనిట.'

'ఆమాత్రం ఉపన్యాసాలుచేసే మొగాడిక్కడ లేకపోలేదు' అన్నాడొక నాయకుడు.

'మనమే వీడికి 'లైసన్సు' యిద్దాం' అన్నాడింకొక నాయకుడు.

ఆరాత్రలా గడచిపోయింది.

రెండుమూడు రోజులైంది. ఆ నూతనవ్యక్తి వూళ్ళో అందరికి కనిపిస్తుండేవాడు. ఒక సాయంత్రం ఆవూరి పెద్దల్ని నలుగుర్ని బంగాళాకు ఆహ్వానించాడు. ఆ సంగతి యీ సంగతి మాట్లాడిన తర్వాత సంఘసేవ ఔన్నత్యాన్ని గురించి ఏదో అన్నాడు. అనూరాధపురం చాల చక్కనిగ్రామం కాగలదని చెప్పాడు. కొన్ని అశ్రద్ధ చేయకూడని విషయాలున్నాయని చెప్పాడు. తాను ప్రతిరోజు రాత్రి గ్రామస్తులకు కొన్ని ప్రధాన విషయాల్లో శిక్షణను యివ్వాలనుకొంటున్నానని చెప్పాడు.

అనూరాధపురం చేరాలంటే సరైన మార్గం లేదు. ఆ వూరికి పదిమైళ్ల దూరాన ట్రంకు రోడ్డు వుంది. అక్కడితో ప్రపంచం అఖరవుతుంది. అనురాధపురం అలా వాస్తవిక జగత్తుకు సంబంధం లేకుండానే బ్రతికి వుంది. ఆవూరిప్రజలకు పొలిమేరదాటి వెళ్ళాల్సిన అగత్యం వుండేదికాదు. అవసరంవున్న కొద్దిమంది ఆ పదిమైళ్ళు ఎంతోకష్టంతో నడచి ట్రంకు రోడ్డు చేరుకొని, అక్కడ బస్సుకోసం కాచుకొని, జీవితంలో అదృష్టంఅనేది బస్సుదొరకటంతప్ప మరోటి కాదనే భావాన్ని పొందేవారు. పరాయివూరివాళ్లు ఆ వూరు సాధారణంగా రారు; వారానికోసారి పోస్టుమనిషి తప్ప. ఇంక వూరి విషయంవర్ణించుటంకంటే వూహించుకొంటేనే బాగుంటుంది. అసలు చిత్రమైన విషయం ఏమిటంటే ఆవూరి ప్రజలెప్పుడూ ఓ రోడ్డుకోసంగాని, తపాలాఫీసుకోసంగాని, పాఠశాలకోసంగాని ప్రయత్నం జరిపి ఎరుగరు. అవన్నీ లేకపోయినా వారికే మీ లోటుంటూ కనిపించినట్లు లేదు.

ఈ చివరివిషయమే నూతనవ్యక్తికి ఎంతో ఆశ్చర్యంగా కనిపించింది. ఏ యుగంలోనూ స్వలాభానికి పాటుపడని మనుష్యులుండరు. అనూరాధపురం ప్రజలకు స్వలాభాపేక్ష లేనట్లు కనిపించిందతనికి; లేకపోతే అలా వుండటమే వారికి లాభమేమో అనుకొని నవ్వుకొన్నాడు. అయినా తన కృషికేమైనా ప్రయోజనముండక పోతుందా అనుకొన్నాడు.

అతని ధోరణిఅంతావిన్నతర్వాత ఆ నలుగురు పెద్ద మనుష్యులు ఏమాత్రం మానసికచలనం

లేకుండానే వెళ్ళిపోయారు. తమ నాయకత్వానికి అవరోధంగా వుండటానికి పట్టణ నాగరకతను వొంటినిండా పూసుకొని వచ్చాడని నూతనవ్యక్తిని అసహ్యించుకొన్నారు. అతనికి పరాభవం చేయాలనే ధృఢసంకల్పం కల్గింది వారికి మామూలు సభల చర్చల్లో.

* * *

నూతనవ్యక్తి చాలా ఆనందపడ్డాడు, వూరి వారందరు తనను బహిరంగసభకు ఆహ్వానించగానే; తనగాలి వారికి బాగానే సోకిందని భ్రమపడ్డాడు. ఆ సభలో గ్రామస్థులందర్ని నిజమైన మనుష్యులుగ చేయగల ననుకున్నాడు.

సాయంత్రం సభ ప్రారంభమైంది. అనూరాధపురంలో సొంతంగా పాఠశాలను నడుపుతూన్న శర్మగారు వేదిక ఎక్కారు మాట్లాడటానికి— 'భారతీయ విజ్ఞానం' మీద. నూతనవ్యక్తి నాయకుల ప్రక్కనే ముందువరసలో కూర్చున్నాడు. ఉపన్యాసకుడు అందరికి నమస్కారం చేసి వినయవిధేయతని గర్వాన్ని మిళితంచేసిన చిరునవ్వుతో మొదలెట్టాడు.

'ఆంగ్లంలో మాటలాడ్డం ఫేషన్ అయినప్పటికి నేను అలాచేయదలచుకోలేదు. నాకు ఇంగ్లీషు రాదనికాదు. కాని స్వాతంత్ర్యాన్ని అనుభవించే ఏ హైందవుడైనా తన మాతృభాషను విడనాడడు. నాకు సంస్కృతం అంటె అభిమానమని మీ అందరకు విశదమే. అది ఆర్యులభాష. కాని ఏంలాభం? ఆభాష మీకు పరాయిదై పోయింది. అందువలన తెలుగులోనే చెప్పదలచుకొన్నాను నాకు తోచిన నాలుగు మాటల్ని. (సభలో హర్షం).

ఈరోజున మన ప్రాచీననాగరకత ఎక్కడున్నదని వెతికితే యీ మన పల్లెగ్రామాలలోనే కనిపించుతుంది. (చప్పట్లు. నాయకుల కళ్లలో ఆనందం మెరుస్తుంటుంది. నూతనవ్యక్తికేసి చూస్తుంటారు, మధ్యమధ్య) మన పూర్వీకులు సంపాదించి మనకందించిన విజ్ఞానమును భద్రంగా కాపాడవలసిన ధర్మం మనదైయున్నది. నేటి ఇంగ్లీషుచదువు మనలనే దిక్కునకు తీసుకొనివెళ్లు చున్నదో మనకందరికి తెలుసు. అపూర్వమైన మన సంస్కృతిని కాపాడుకొనుటకు మన ప్రాచీనగ్రామ జీవనమే ఆధారము. కనుక మన గ్రామములను పట్టణముల ఒత్తిడినుండి, మన గ్రామ ప్రజలను నాగరికులమని గర్వించే మోసకారుల బారినుండి రక్షించుకొనవలయును. (అందరి కళ్లు నూతనవ్యక్తిపై వుంటాయి). ఒక చిన్న ఉదాహరణ యిస్తాను. మన అనురాధపురం ఎవ్వరికి అందనిది. అందుచేతనే మన నాగరకత పూజనీయమైవుంది యింకా. రోడ్లు నిర్మించి రాకపోకల సౌకర్యాలు ఎక్కువ చేసినచో మన ప్రాచీన సంస్కృతి మైలపడి పోతుంది. పట్టణాల అలజడిలో మన ధర్మం అంతా నాశనమైపోక తప్పదు...'

నూతనవ్యక్తి దిగ్భ్రాంతుడై తానెక్కడుంది తెలీక చూస్తున్నాడు శూన్యంలోకి. ఒక్కసారి అతనావూరిలో నిర్మించుకొన్న సౌధాలన్నీ కూలిపోయాయి. పల్లెటూరి ప్రజలు అమాయకులని, భగవంతుడు సృష్టించిన రూపానికి దగ్గరవారని అనుకున్నాడు.

వారికి సరైన జీవిత విధానాన్ని తెలియబరుస్తే వింటారనే నమ్మకంతో ఆవూరు వచ్చాడు.అతడు చూసిన చిత్రం మరోలావుంది. అక్కడ వుండే ధనికులు అహంకారంగలవారు. కక్షల్లో మునిగివుంటారు. బీదవారందరు బానిసలే. గ్రామంలో కట్టు బాటు వుందంటారు. అది సమ్మతంతో కూడిన కట్టు బాటు కాదు. అధికారం వున్న వాడి మాట మిగతావాళ్లు వినటం. ఆ అధికారవంతులను మార్చటం కష్టం. వారు తాము ప్రపంచానికి మూలాధారం అనుకొంటారు. హేతు వాదనకు లొంగరు. వారి అధికారం యితరుల అజ్ఞానం పై కట్టబడి వుంది. పునాదిని ఎవరైనా కదపటానికి ప్రయత్నంచేస్తే ఒప్పుకోరు.

తిరిగి ట్రంకు రోడ్డుకేసి ప్రయాణం చేస్తున్నాడు. ఈసారి ఆపది మైళ్లు కొన్నియోజనాల్లాగ కనబడ్డాయి. ఒక్కసారి అనురాధ పురాన్ని దూరానించి చూస్తే పాడు పడ్డ దేవాలయం ప్రతిభ తెలిసిందా అన్నట్టు కనపడింది.

అనూరాధపురం అతని దృష్టిలో మరో ప్రపంచం. తానుండే ప్రపంచంలో వున్న విజ్ఞాన సాధనాల్నటిని అవూళ్లో వుపయోగించినా అక్కడిప్రజలకు జ్ఞానం ఎంతో దూరంగానే వుంటుంది. తన అశక్తి అర్థమయింది చివరికి.